# బంగారు ప్రాయమిది..



శీలంశెట్టి రమాదేవి

"బంగారు ప్రాయమిది, పవళించవె నా తలీ- ఈ వయసు దాటితే నిదురేది మళ్ళీ...." రేడియోలో పాట వినబడుతోంది.

చందనకు కళ్ళవెంబడి నీళ్ళు తిరుగుతోన్నయ్ ఆ పాట వింటూంటే.

నిజమేనా? ఆడదానికి ఆ చిన్నారి ప్రాయంలోనేనా నిదరపోయేందుకు అవకాశం దొరికేది? ఆ తరువాత కంటిమీద కునుకే ఉండదా?

బహుశా నిజమేనేమో!

ప్రతిఒక్కరికీ కాకపోయినా, సాధారణంగా చాలామంది విషయంలో అది నిజమేనేమో!

ఎవరిదాకానో ఎందుకు? తన సంగతేమిటి?

ఆ బంగారు ప్రాయంలో తనెంతగా నిదురపోయిందీ తనకు తెలీదు. కానీ ఊహ తెలిసింతర్వాత నిజంగా తను కంటినిండా నిద్రపోయిన రోజులెన్ని ఉన్నయ్.

కనీసం వేళ్ళమీద లెక్కించదగి నన్నయినా ఉన్నాయా?

చిన్నప్పుడు తామున్న ఇల్లు ఎంత ఇరుగ్గా ఉండేది? దానికి తోడు కిటికీలు లేకపోవడంచేత గాలి రాక, దోమల బాధతో రాత్రంతా కలతనిద్రతోనే గడచిపోయేది. తెల్లారుఝామున గాఢంగా నిద్రపట్టే సమయంలో చదువుకోడానికని తననూ మిగతా పిల్లలనూ నిద్రలేపి దీపం ముందు కూర్చోబెట్టేది అమ్మ. అంతే ఆ నిద్ర అక్కడితోనే ముగిసిపోయేది.

అయిదోక్లాసు వరకూ ఆ కలత నిద్రలోనే గడచిపోయింది.

ఆ తరువాత తనకే చదువుమీద శ్రద్ధ పెరిగిపోయింది. స్కూలునుంచి రాగానే అమ్మకి వంటపనిలో సహాయం చేయడం ఆ తరువాత భోజనాలు. అప్పుడు హోమ్‌వర్క్ చేసుకోవడం, చదువుకోవడం_ కాసేపయినా సుఖమయిన నిద్రపోకుండానే మళ్ళీ తెల్లారుజామున అమ్మ తనను నిద్ర లేపేయడం_అంతే! మిడిల్‌స్కూల్ చదువయేవరకూ ఆ కార్యక్రమంతోనే నిద్ర దూరమయింది. ఆ తరువాత తనకి పెద్దరికం అంటగట్టేసింది అమ్మ. తన పనే కాకుండా తమ్ముడూ, చెల్లాయిల బాగోగులన్నీ కూడా తనమీదే పడినయ్. వాళ్ళిద్దరికీ స్నానాలు చేయించడం, తలలు దువ్వడం, బట్టలు తొడగడం, చదివించడం, ఒకటేమిటి? అన్నీ! దాంతో క్షణం తీరిక లేకుండా పోయింది. అర్ధరాత్రివరకూ హడావుడే!

కాలేజీలో అడుగు పెట్టాక వారిద్దరి బాధ్యతా కొంత తగ్గిపోయింది. కాని వయసు తన రూపంలో తెచ్చిన మార్పులతోపాటు మనసు కూడా ఆ వయసుకి తగ్గ ఆలోచనలను కోరికలను పదిలం చేసుకొంది. తను కాలేజీకెళ్ళే త్రోవలో గదిలో అద్దెకుండే బి.యస్సీ. విద్యార్థి తనవంక చూసే చూపులు తనకి నిద్రలేకుండా చేసేవి. ఏవేవో ఆలోచనలు, భయం ఆవహించి మనసుని కలవరపరచేవి.

కాలేజీలో జరిగిన సాంస్కృతికోత్సవ సందర్భంలో అతనితో ఏర్పడ్డ పరిచయం కొత్తరూపు సంతరించుకొంటోందనీ, అది ఇద్దరిమధ్యా ప్రేమలేఖలకు దారి తీస్తుందనీ తననుకుందా? ఎంతో మధురమైనవా రోజులు. అతనితో ఎక్కడయినా రెండు నిమిషాలపాటు మాట్లాడే అవకాశం కోసం కళ్ళు కాయలుకాచేలా ఎదురుచూడలేదూ తను? ఆ లేత ప్రేమ

తన కంటిమీద కునుకు రాకుండా అడ్డు పడలేదూ? రాత్రంతా ఎన్నో మధుర మయిన ఊహల్తో, తీయగా బాధించే కోరికలతో గడచిపోయేది కదూ? ఎన్నో రాత్రులు అలానే తెల్లారిపోయాయ్

ఆ తరువాతి సంవత్సరం అతనా కాలేజీ వదలి వెళ్ళిపోయిన విషయం తెలుసుకొని తనెంత బాధపడింది? కనీసం ఆ విషయం తనతో చెప్పనయినా చెప్పకుండా వెళ్ళిపోడంలో గల అతని ఉద్దేశం తెలుసుకొని తన మనసు ఎంతగా గాయపడింది?

ఆ గాయం చాలారోజులు తనని నిద్రకు దూరం చేసింది కళ్ళు మూసినా, తెరచినా అతని గురించిన ఆలోచనలే.

కాలేజీ ఫైనలియర్ పరీక్షలు దగ్గర పడినయ్

రాత్రి తెల్లార్లూ చదివింది తను. చన్నీళ్ళుపెట్టి కళ్ళు కడుక్కొనీ, అర్ధ రాత్రి 'టీ' కాచుకొని తాగీ- నిద్రను దూరం చేసుకొంది.

తను కష్టపడి చదవాలి చదివి మంచి మార్కులతో పాసవ్వాలి తప్పితే తనను ఓ సంవత్సరంపాటు భరించేంత ఆర్థికస్థితి తన కుటుంబానికి లేదు అందుకే అవలీలగా మొదటి ప్రయత్నంలోనే గ్రాడ్యుయేట్ నని పించుకోగలిగింది ఆ ఆనందంలో చాలా రోజులు నిద్రపట్టలేదు

తను ఉద్యోగం కోసం వెతుకు తోంటే, తల్లిదండ్రులు తనకు పెళ్ళి సంబంధాలకోసం వెతకసాగారు ఉద్యోగమూ దొరకక, పెళ్ళిసంబంధమూ కుదరక మనశ్శాంతి దూరమయి పోయింది దానితోపాటు నిద్రానూ! రోజురోజుకీ పెరిగిపోతున్న దిగులుకీ, నిద్రకూ పొత్తెలా కుదురుతుంది ప్రతి రాత్రీ కలెక్టరాఫీసు రాణాలో రెండు గంటలు కొట్టటం విన్న తరువాత గానీ కళ్ళు మూతపడేవికావు

మరికొన్ని రోజుల ఆ దుర్భర పరిస్థితి తరువాత తనకు వివాహం నిశ్చయ మయిపోయింది వరుడు తనకూ నచ్చాడు అతని ఆదర్శాలూ తనకు నచ్చినయ్ అలా అన్నీ నచ్చిన భర్త లభించే అదృష్టం ఎంతమందికి ఉంటుంది?

ఆరోజునుంచీ పూర్తిగా నిద్ర దూర మయిపోయింది తనకు తన గురించీ, తనకాబోయే భర్తగురించీ, తామిద్దరూ గడపబోయే మధురమయిన జీవితాన్ని గురించీ ఎడతెరపిలేని ఆలోచనలు పట్ట రానంత ఆనందం?

వివాహం జరిగిపోయింది

తీయని రాత్రులు, పగలు రాత్రిగానూ, రాత్రి పగలుగానూ మారిపోయినట్లనిపించింది

ఏది వెన్నెలరాత్రో, ఏది చీకటిరాత్రో తెలుసుకొనే తీరిక ఎక్కడిదీ?

అసలు నిద్రంటే ఏమిటో మర్చిపోయినంత పనయింది

ఏ తెల్లారు జామునో నిద్రపట్టినా ఆయన చేసే చిలిపి చేష్టలతో అది కూడా పారిపోయేది

రెండేళ్ళకూడా గడవకుండానే గర్భం_

తమ దాంపత్య జీవితం పాతపడుతోంది ఇక కంటినిండా నిద్రపోవచ్చను కొంటున్న సమయంలో ఇది_

ఇంకెక్కడి నిదుర?

నెలలు గడుస్తున్నకొద్దీ ఆందోళనా, భయం

అవన్నీ పాపని కన్న తరువాత గానీ నెమ్మదించలేదు ఆ రోజు గాని తనకు స్థిమితం చిక్కలేదు

కానీ ఆ రోజునుంచీ ఆ పాపాయితో అసలు ఆ కాస్త నిద్రా కరువయిపోయింది ఏ క్షణాన్న పాపాయి లేచి ఏడుస్తుందో, అర్ధరాత్రుళ్ళు ఎలా సముదాయించాలో నని భయపడ్డట్లుగా జరిగేదంతా!

అప్పుడప్పుడూ పాలు పట్టించడం, ఉయ్యాల ఊపడం_ ఒకోరోజు సముదాయిస్తూండగానే తెల్లారిపోయేది

పాపాయి పెద్దదయేవరకూ ఆ కార్యక్రమానికే అలవాటుపడిపోయింది

ఆ తరువాత బాబు పుట్టాడు మళ్ళీ అదే గాడిలో పడిపోయింది తను

ఆ తరువాత మళ్ళీ పాప!

అసలు నిద్రగురించి ఆలోచించే తీరికకూడా లేకుండా పోయింది

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతోంటే, వాళ్ళతోపాటు పెరిగిపోతున్న బాధ్యతలు తనమీద పడుతోంటే ఇంక నిద్రెలా పడుతుంది?

ఎప్పుడయినా ఓసారి అర్ధరాత్రి నిద్రలేచి, మంచినీళ్ళు తాగి మళ్ళీ పడుకోబోతూ తనవేపు చూసి, తను ఇంకా కళ్ళు తెరచుకొనే ఉండటం గమనించి ఆయన ఆశ్చర్యంతో "ఇంకా నిద్రపోలేదుటోయ్" అంటూ పలుకరించినప్పుడు తను చిరునవ్వుతో కళ్ళు మూసుకోవడం తప్పిస్తే ఏం జవాబివ్వగలదని?

ఆ తరువాత తన తల్లిదండ్రులకు జబ్బుచేయడం, తండ్రి చనిపోవడం, అత్తగారు, మామగార్లను తెచ్చి తమ ఇంట్లో ఉంచుకోవడం, వారి బాధ్యత కూడా తనమీదే పడడం_ఇంకేం నిద్రకు నోచుకోగలదు తను?

పిల్లల ముద్దూ ముచ్చటలు, శ్రీవారితో రహస్య ప్రణయకలాపాలు, అత్తామామలకు సపర్యలు, ఇంట్లో చాలీచాలని ఆర్ధికవనరులూ—— వీటికీ, నిద్రకూ సమన్వయం ఎలా కుదురుతుంది?

రాత్రి ఒంటిగంట తర్వాత పడుకొని ఉదయం ఏడున్నరకు స్కూలుకెళ్ళాల్సిన పిల్లల కోసమని తెల్లారుజామునే నిద్రలేవడం అలవాటయిపోయింది. కంటి

నిండా నిద్రపోవాలని ఎప్పుడయినా అను కొన్నా ఆరోజు మరింత త్వరగా మెల కువ వచ్చేస్తుందేగాని నిద్రపట్టిన పాపాన పోదు

"అమ్మా! నేను శేఖరాన్ని ప్రేమిం చానే," అని కూతురు చెప్పిన రోజున తనెంత తల్లడిల్లిపోయింది.

ఆ వయసులో ఏర్పడేది ప్రేమ కాదనీ, ఆకర్షణ అనీ ఆమెకు చెప్ప డానికి ఎంత తాపత్రయపడిపోయింది?

ఆమె తన మాట వింటుందో వినదో నని ఎంతగా బెంబేలెత్తిపోయింది? ఎన్నోరోజులు దాన్నిగురించిన ఆలోచ నలతోనే నిద్రపట్టేది కాదు. ఆ శేఖరం అనే కుర్రాడిని తనూ ఓసారి చూసింది ఎందుకో తెలీదుగాని తన మనసుకి నచ్చ లేదు ఆనాడు తను ప్రేమించాననుకొన్న బి యస్సీ విద్యార్థి గుర్తుకొచ్చాడు ఆ వయసులో, అంత త్వరగా ఏర్పరుచు కొనేది ప్రేమెలా అవుతుంది?

తన అనుభవమే చెప్తోంది కాదని తన శరీరపు ఇంపుసొంపులకు అతను ఆకర్షింపబడ్డాడు అతని అందచందాలకు తనూ అతనివేపు మొగ్గింది

ఆతరువాత అతను తనకు చెప్ప కుండానే ఆ కాలేజి వదిలి వెళ్ళిపోయి నప్పుడు కొంచెం బాధపడింది అంతే. మళ్ళీ ఎప్పుడూ అతను తనకి గుర్తు రాలేదు బహుశా అతనా ఊరు వదిలిన క్షణంనుంచే తనను మర్చిపోయుంటాడు.

కూతురు వొప్పుకొంది

మరో అయిదేళ్ళ తరువాత కూడా ఆమె ఇంకా శేఖరాన్నే ప్రేమిస్తున్నా ననేట్లయితే, అప్పటివరకూ అతనూ ఆమెనే ప్రేమిస్తున్నట్లయితే- అప్పుడు తను అది నిజమయిన ప్రేమగా భావిస్తా నని చెప్పింది వారిద్దరి వివాహానికి వొప్పు కుంటాననీ, తండ్రితో కూడా వొప్పిస్తా ననీ మాట ఇచ్చింది

ఆ అయిదేళ్ళూ తనకెంత భయం? ఎంత ఆత్రుత! ఎంత ఉత్సుకత-

తననుకొన్నట్లే వారి ప్రేమ-ప్రేమగా గాక ఓ మామూలు ఆకర్షణగా తేలి పోయినరోజు తనెంత తేలికగా గాలి పీల్చుకొంది

"నేను అతన్ని ప్రేమిస్తూనే ఉన్నా నమ్మా! నాది నిజమయిన ప్రేమే! కానీ అతనే— నన్ను కపటంగా ప్రేమించాడు అందుకే నన్ను మర్చిపోయాడు" ఉంటూ బాధతో అంటోన్న కూతురిని దగ్గరకు తీసుకుని లోలోపలే దుఃఖించిన రోజు తనకి నిద్రేది?

ఆ తరువాత ఎన్నోరోజులు అర్ధ రాత్రి లేచి కూర్చుని అమాయకంగా కనిపించే కూతురి మొహంలోకి బాధతో చూస్తూ కూర్చుండిపోయేది

ఆమెకు వివాహ ప్రయత్నాలు చేయడం, కట్నాల సమస్యవల్ల అన్నీ వెనక్కుపోవడం- ఆ దిగులుతో మళ్ళీ నిద్ర కరువయిపోయింది.



ఎన్నో సంవత్సరాల తర్వాత దానికి ఓ సంబంధం కుదిరినప్పుడు ఆ రోజు హాయిగా నిద్రపోవాలనుకొంది. కాని ఆ ఆనందంలో నిద్రపడితేనా ?

ఈలోగా వివాహపు వేడుకలు మొదలయిపోయినయ్. ఇల్లంతా బంధువులు, హడావుడి ! రాత్రీ పగలూ ఒకటే పని !

వివాహం జరిగిపోయిన ఒకటి రెండు నెలలవరకూ కంటిమీద కునుకెలా పడుతుంది. క్షణం తీరికలేనంత హడావుడి.

విశ్రాంతి తీసుకొందామనుకొంటూండగానే పండుగలు-అమ్మాయినీ, అల్లుడినీ ఇంటికి పిలవడం - సరదాలు - సంతోషాలు -

ఈలోగా కూతురికి గర్భం -

ఇంకెక్కడి నిద్ర ?

ఆమెని కంటికి రెప్పలా కాపాడి, నర్సింగ్‌హోమ్‌కి చేర్చి ఎన్నో రాత్రుళ్లు

అక్కడ నిద్రలేకుండా గడిపి ఓ మనమ రాలితో పాటు ఇల్లు చేరుకొంది.

ఆ పసికందు అల్లరితో, ఏడుపుతో, ఎవరికిమాత్రం ఎలా నిద్రపడుతుంది

ఆమె మూడో నెల తర్వాత వెళ్ళి పోయాకగానీ విశ్రాంతి చిక్కినట్లనిపించ లేదు

ఈలోగా కొడుకు వివాహం.

మళ్ళీ మొదలు—

వివాహ ప్రయత్నాలు—

వివాహం—

ఆ తర్వాత వేడుకలు—

కోడలికి గర్భం—

మనవరాలు—

"అమ్మా! పడుకోకుండా ఏమిటా ఆలోచనలు?" అడిగాడు కొడుకు తన మంచం దగ్గరకొచ్చి

చందన చప్పున కన్నీళ్ళు తుడుచు కొంది అంతలోనే నవ్వు కూడా వచ్చింది.

"ఇంక నిద్రెలా పడుతుందిరా! ఆ అలవాటెప్పుడో తప్పిపోయింది బంగారు ప్రాయంలోనే మర్చిపోయా నా నిద్రని"

గుండెల్లో నొప్పి—

బాధగా మూలిగింది చందన

"మళ్ళా నొప్పి వస్తోందా అమ్మా?" భయంగా అడిగాడు కొడుకు.

"కొంచెం - అంతగా లేదులే సర్దుకొంటూ అందామె

రేడియోలో పాట ఆఖరి చరణం వినబడుతోంది

'బంగారు ప్రాయమిది పవళించవె నా తల్లీ

"ఓసారి పాపాయిని తీసుకురారా... ఆయాసంగా అందామె అతను వెళ్ళి ఉయ్యాలలోనుంచి పాపాయిని చేతుల మీద తీసుకొచ్చాడు.

ప్రశాంతంగా నిద్రపోతోం దా పాప

"ఏయ్- చిట్టీ- నాయనమ్మ పిలుస్తోంది చూడు" పాపాయిని లేపబోయాడు కొడుకు

"వద్దురా - వద్దు - లేపకు - దానికి నిద్రపట్టేది ఈ వయసులోనే తరువాత నిదురేది మళ్ళీ" ఆత్రుతగా అంది చందన

అతనికి తల్లి మాటలు అర్థంకాలేదు.

రేడియోలో పాట ఆగిపోయింది

చందన భారంగా కళ్ళు మూసుకుంది.

తనకి నిద్రపట్టేది ఇక ఆఖర్లోనే-

అది శాశ్వత నిద్ర—

———